ప్రజాశక్తి
సోమవారం 17 జులై 2023
5



అల్లూరి సీతారామరాజు

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

- అల్లూరి యూత్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అల్లూరి యూత్ మండల అధ్యక్షుడు కే సూర్య ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గతంలో చాపరాయి నిర్వహణకు అధికారులు టెండర్ పాట నిర్వహించే వారని, ఈ ఏడాది నుంచి టెండర్ పాట నిర్వహించకుండా ఐటీడీఏ నిర్వహణ కొనసాగిస్తుందన్నారు. చదువుకున్న స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ సుమారు ఐదు మాసాలు గడుస్తున్నా స్థానిక యువతకు ఉపాధి కల్పించక పోవడంతో నిరుద్యోగ యువత తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. తక్షణమే ఐటిటిఏ అధికారులు స్పందించి చాపరాయి జలపాతంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అల్లూరి యూత్ నాయకులు పాల్గొన్నారు.

వెదురు కొమ్ములకు గిరాకీ

-సంతలు, మండల కేంద్రాల్లో అమ్మకాలు - పోషక విలువలున్న శాఖహార వంటకం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజన ప్రాంతాల్లో వెదురు కొమ్ముల సీజన్ ప్రారంభమైంది. వెదురు చెట్ల మొదల చిగుళ్లను గిరిజనులంతా పూర్వం నుంచి వెదురు కొమ్ములుగా పిలుస్తుంటారు. వెదురు కొమ్ముల కూర మంచి రుచిగా ఉంటుంది. ఈ చిగుళ్లను సేకరించి వాటిని మంచి శాఖాహార వంటగా ఈ సీజన్ లో గిరిజనులతో పాటు మైదాన ప్రాంత ప్రజలు కూడా అధికంగా తింటుంటారు. వర్షాకాలంలో వెదురు చెట్ల మొదళ్లకు చిగుళ్ల ఏర్పతాయి. అడవులతో పాటు గిరిజనులు సొంతంగా వేసుకున్న వెదురు చెట్ల వద్ద ఈ చిగుళ్లను సేకరించి ఇళ్లకు తీసుకువచ్చి కూర వండుకునేలా వెదురు కొమ్ములుగా తయారు చేస్తారు. ఆ వెదురు చిగుళ్ల సేకరించకపోతే కొన్నాళ్లకు అవే నిటారుగా ఎదిగి వెదురు వనాలుగా పెరుగుతుంటాయి. ఈ సీజన్‌లో దొరికే వెదురు కొమ్ముల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని, అవి తినడం ద్వారా ఆరోగ్యానికి దోహదం చేస్తుందని పూర్వం నుంచి గిరిజనుల నమ్మకం. ఈ వెదురు కొమ్ములను వేపుడు, ఇగురు కూరలుగా వండుకుని తింటారు.



వెదురు కొమ్ములు

ఎగబడి కొంటున్న వినియోగదారులు..

వెదురు కొమ్ములు వినియోగదారులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం వారపు సంతలు, మండల కేంద్రాల్లో, పాడేరు ఘాట్‌లో ఆదివాసీలు వెదురు కొమ్ములను విక్రయిస్తున్నారు. ఒక వాటా (ఐదు కొమ్ములు) రూ.50 ధరతో అమ్ముడవుతుంది. పాడేరు డివిజన్‌తో పాటు పాటు రంపచోడవరం డివిజన్‌లోని మారెడుమిల్లి, చింతూరు, అడ్డతీగల రాజవొమ్మంగి, వై.రామవరం, లంబసింగి ఘాట్ ప్రాంతాల్లోను వెదురు కొమ్ములకు ఈ సీజన్‌లో మంచి డిమాండ్ ఉంది. అనంతగిరి, లంబసింగి, పాడేరు, సీలేరు, మారెడుమిల్లి, మోతుగూడెం ఘాట్ రోడ్ల వెంబడి కూడా వెదురు వనాలు అధికంగా ఉండడంతో ఆయా మొదళ్ల వద్ద వెదురు కొమ్ములను సేకరిస్తుంటారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటించే పర్యాటకులు, పలు వర్గాల ప్రజలు కూడా వెదురు కొమ్ముల వంటకాలకు అలవాటు పడటంతో ఈ సీజన్‌లో వారు కూడా కొనుగోలు చేస్తుంటారు.



పాడేరు మార్కెట్‌లో అమ్మకాలు జరుపుతున్న మహిళ

అమ్మకాలతో జీవనం

వర్షాకాలం ప్రారంభమైందంటే ఆదివాసీలు సంప్రదాయ ఆహారంగా వెదురు కొమ్ములను తింటారు. ఈ సీజన్‌లో వెదురు మొక్కల వద్ద అధికంగా వెదురు చెట్ల మొదళ్ల చిగుళ్ల వస్తాయి. ఈ లేత వెదురు చెట్ల చిగుళ్లను సేకరించుకుని కొమ్ములుగా తయారు చేసి కూరగా చేసుకుని తినడం ఆనవాయతీ. తొలి నాళ్లలో వెదురు కొమ్ములను ఆదివాసీలు మాత్రమే ఆహారంగా తీసుకునేవారు. కాల క్రమంగా అన్ని వర్గాల ప్రజలు వెదురు కొమ్ములను ఆహారంగా తీసుకుంటున్నారు. ఈ సీజన్‌లో వాటా రూ.50కు విక్రయించి వచ్చిన డబ్బులతో జీవనం కొనసాగిస్తుంటాం




వంతాల కాంతమ్మ, దోకులూరు

శంకుస్థాపనతో సరి

- ముందుకు సాగని డెక్కపురం రోడ్డు

ప్రజాశక్తి-అనంతగిరి: మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు నిర్వహించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేపట్టి 4. నెలలు గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండు మండలాల సరిహద్దు పిటిజీ గ్రామాలకు పాడేరు కనెక్టివిటీ కింద రోడ్డు సౌకర్యం మంజూరు అయింది. పనులు ప్రారంభించేందుకు మండల ప్రజాప్రతినిధులు గత నాలుగు నెలల క్రితం శంకుస్థాపన చేపట్టారు. పనులు ప్రారంభించేందుకు గుత్తేదరులు సిద్ధంగా ఉన్నప్పటికీ ఫారెస్ట్ శాఖ అధికారులు రోడ్డు పనులకు ఆటంకం పరుస్తుడటంతో శంకుస్థాపనతో సరిగా మారింది. అనంతగిరి మండలం అనంతగిరి పంచాయతీ రాజుపాక గ్రామం నుండి డెక్కపూరం మీదుగా హుకుంపేట మండలం పటక దౌవడ గ్రామం వరకు సుమారు 2. కోట్ల 50 లక్షలు ట్రైబల్ వెల్ఫేర్ నిధులు మంజూరు అయ్యాయి. పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ అటవీ శాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్త పరచడంతో పనులు ముందుకు జరగకుండా నిలిచిపోయాయి. తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు మోక్షం లభిస్తుందని ఆశ పడ్డ పి.టి.జి ప్రజలకు నిరాశే మిగిలింది. ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకుని మంజూరైనా రోడ్డు పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పనులకు వేసిన శిలాఫలకం

తుంపర్ల, బిందు సేద్యానికి ప్రోత్సాహం

-గిరి రైతులకు సబ్సిడీపై డ్రిప్, స్పింకర్లు పంపిణీ -ప్రజాశక్తితో జిల్లా ఉద్యాన అధికారి రమేష్ కుమార్‌రావు

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లాలోని పాడేరు, రంపచోడవరం డివిజన్లలో ఉద్యాన వ్యవసాయ రంగంలో గిరిజన రైతులను అభివృద్ధి చేసేందుకు తుంపర్ల, సూక్ష్మ బిందు సేద్యంతో తోడ్పాటు నందిస్తున్నట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఏ రమేష్ కుమార్‌రావు వెల్లడించారు. ఈ ఉద్యాన వ్యవసాయ విధానంపై గిరిజన రైతులకు అందిస్తున్న సహకారంపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే..

సబ్సిడీ వివరాలు ఏమిటి?

సూక్ష్మ, బిందు సేద్యం, తుంపర్ల సేద్యం చేపట్టేందుకు గిరిజన రైతులకు రెండు కేటగిరీలుగా సబ్సిడీ అందిస్తున్నాం. ఐదు ఎకరాల లోపు విస్తీర్ణంలో చేపట్టే సేద్యానికి డ్రిప్‌కు 90 శాతం సబ్సిడీ, 5 నుంచి12 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టే సేద్యానికి 50 శాతం సబ్సిడీ అందిస్తున్నాం.

ఎలా నమోదు చేసుకోవాలి

స్పింక్లర్లకు ఐదెకరాల లోపు విస్తీర్ణానికి 55 శాతం సబ్సిడీ, ఐదు నుంచి 12 ఎకరాల లోపు విస్తీర్ణానికి 45 శాతం సబ్సిడీ అందిస్తున్నాం. ఈ సేద్యంకు సబ్సిడీ పొందవలసిన రైతులు తమ తమ సచివాలయాల్లో ఆధార్, బ్యాంక్ పాస్ బుక్‌లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

పరికరాల ఉచిత నిర్వహణ

సబ్సిడీ ద్వారా బిందు సేద్య పరికరాలు (డ్రిప్ మరియు స్పింక్లర్లు) పొందడానికి ప్రభుత్వం ద్వారా సబ్సిడీ మంజూరు పొందిన రైతులు ముందుగా వారి వాటా కింద పది శాతం సొమ్మును బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. అప్పుడు పరికరాలు కొనుగోలు చేసి వారి సాగు భూమిలో కంపెనీ ద్వారానే డ్రిప్, స్పింక్లర్లను అమర్చి ఐదేళ్లపాటు వాటి నిర్వహణ పై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ ఉచితంగా పరికరాల నిర్వహణకు చర్యలు తీసుకుంటాం.

రాయితీలు పొందిన రైతులు

పాడేరు డివిజన్లో ఈ సేద్యానికి అనుకూలమైన కొయ్యూర్, చింతపల్లి, అనంతగిరి, అరకు తదితర మండలాల్లో ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. గతంలో ఏడేళ్ల క్రిందట ఈ బిందు సేద్యానికి రాయితీలు పొందిన రైతులకు మళ్ళీ కొత్తగా సబ్సిడీ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చు.




లాభసాటిగా ఉంటుందా?

ఈ తుంపర్ల / సూక్ష్మ బిందు సేద్యం చేపట్టేందుకు ముఖ్యంగా నీటి వసతి ఉండాలి. తక్కువ నీటితో ఎక్కువ వ్యవసాయం సాధ్యపడుతుంది. అదే విధంగా ఈ ఉద్యాన వ్యవసాయానికి నీటి, విద్యుత్ ఆదా, తక్కువ మ్యాన్ పవర్, కూలి ఖర్చులు తగ్గడం వంటి ఎన్నో ప్రయోజనాలతో రైతులకు లాభసాటిగా ఉంటుంది.

ఏజెన్సీలో పంటల సాగు

బిందు సేద్యం ద్వారా పలు రకాల కాయగూరల పెంపకంతో పాటు జీడి మామిడి, అరటి పామాయిల్, బొప్పాయి వంటి ఉద్యాన పంటలతో పాటు రైతులు తమ పశువుల దాణాకు పచ్చ గడ్డి పెంపకం కూడా చేపట్టవచ్చు. అల్లూరి జిల్లాలో ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ లక్ష్యం మేరకు నమోదు ప్రక్రియ ప్రారంభించాం. ఉద్యాన వ్యవసాయ అభివృద్ధికి గిరిజన రైతులకు తోడ్పాటు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.



జిల్లాలో సేద్యం లక్ష్యం

జిల్లాలో సూక్ష్మ సేద్యం అత్యంత ఆవశ్యకమైనదిగా గుర్తించి ఈ ఏడాది 1000 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యాన్ని ప్రోత్సహించాలని లక్ష్యంగా నిర్ణయించాం. అర్హులైన రైతుల నుండి దరఖాస్తుల స్వీకరణ, బయోమెట్రిక్ విధానము ద్వారా నమోదు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించాం. ఇరిగేషన్ కంపెనీలు ప్రభుత్వ రాయితితో పరికరాలు అందించేందుకు సిద్దంగా ఉన్నాయి.

గత ఏడాది సేద్యం

గత ఏడాది సూక్ష్మ సేద్యం ద్వారా 200 హెక్టార్లు సాగు చేయాలని నిర్దేశించినప్పటికీ, 259 హెక్టార్లలో సాగు చేపట్టడం జరిగింది. ఈ ఏడాది 1000 హెక్టార్లు లక్ష్యం కాగా ఇప్పటికే 658 మంది రైతులు 800 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం చేయడానికి పేర్లు నమోదు చేసుకున్నారు. ఆసక్తి ఉన్న రైతులు ముందుకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

బిందు సేద్యంతో లాభాలు

పంటను బట్టి 50-80 శాతం వరకు నీటిని ఆదా చేసి ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చు. ఎగుడు దిగుడు భూములలో వాలు ప్రాంతాలలో కూడా మొక్కలకి నీరు సమానంగా అందించవచ్చు. నీటిలో కరిగెడి ఎరువులను బిందు సేద్యం ద్వారా సరఫరా చేయడం ద్వారా మొక్కలకు పోషకాల వినియోగం సామర్ధ్యం పెరిగి పంట నాణ్యత, దిగుబడి పెరుగుతుంది. 30-50 శాతం వరకు విద్యుత్ ఖర్చు / ఇందన ఖర్చు ఆదా అవుతుంది. ఏక కాలంలో పంట కోతకు వస్తుంది. పంటలకు చీడ పిడలు, పురుగు సమస్య తగ్గుతుంది. 30-70 శాతం వరకు పంట దిగుబడి పెరుగుతుంది.

చిరుజల్లులతో సంతకు ఇక్కట్లు

ప్రజాశక్తి -సీలేరు : ముసురుని తలపించేలా మబ్బులు పట్టి, చిరుజల్లులు కురవడంతో ఆదివారం సీలేరు వారపుసంతకు వచ్చే వ్యాపారులతో పాటు కొనుగోలు దారు లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అర్ధరాత్రి నుంచి ఉదయం 11గంటల వరకు వర్షదుమారం పడుతూ ఉండడంతో వ్యాపారులు గొడుగులు వేసుకుని కూరగాయలు అమ్మే పరిస్థితి ఉండగా, చిత్తడిగా తయారైన సంత ప్రదేశానికి వచ్చిన కొనుగోలుదారులు కూడా అవస్థలు పడ్డారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు మారుమూల ప్రాంతాల నుంచి గిరిజనులు వారవసంతకు ఆశించిన స్థాయిలో రాలేదు. దీంతో వారపుసంత వెలవెలబోయింది. ఆశించినస్థాయిలో వ్యాపారాలు జరగక వ్యాపారులు నిరాశకు గురయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బులతో కూడిన వాతావరణం సీలేరు పరిసర ప్రాంతాల్లో నెలకొంది.



గొడుగులు వేసుకుని సంతకు వచ్చిన గిరిజనులు

చికిత్స పొందుతూ బాలింత మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని లోదొడ్డి గ్రామానికి చెందిన బటారి రామలక్ష్మి అనే బాలింతకాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. నాలుగు నెలల క్రితం మగ బిడ్డకు జన్మనిచ్చిన రామలక్ష్మి, ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో వైద్యుల సలహా మేరకు కుటుంబసభ్యులు కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు, అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో రామలక్ష్మి మృత్యువాత పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అడిషనల్ డిఎంహెచ్‌ఒగా భాస్కర్



డాక్టర్ భాస్కర్

ప్రజాశక్తి- అడ్డతీగల : రంపచోడవరం అడిషనల్ డిఎంహెచ్‌ఒగా అడ్డతీగల మండలం ఎల్లవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డా.భాస్కర్‌ను నియమిస్తూ ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరె సూచనల మేరకు ఉత్వర్వులు జారీ చేసినట్లు జిల్లావైద్యాధికారి డాక్టర్ జమాల్ భాషా తెలిపారు. ఇప్పటి వరకూ ఎడిఎంహెచ్‌ఒగా పనిచేసిన డాక్టర్ అనూష బదిలీపై వెళ్లగా, ఆ స్థానంలో డాక్టర్ భాస్కర్‌ను నియమించారు. కరోనా సమయంలో విశిష్ట సేవలను అందించిన భాస్కర్, ప్రజల మన్నలను పొందారు. ఆపద అని తెలిస్తే ప్రభుత్వపరంగా వైద్యసాయం అందించడంతోపాటు తాను సొంతంగా ఆర్థిక సాయాన్ని అందించి ఎంతోమందికి ఆసరాగా నిలిచారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ల పంచాయతీ బాలరేవుల గ్రామంలో 40 మంది ఆదివాసీ విద్యార్థులకు పలకలు, నోటుబుక్స్, పెన్నులు, పెన్సిళ్లను కొయ్యూరు గ్రామానికి చెందిన దుమంతి. సత్యనారాయణ ఆదివారం పంపిణీ చేశారు. పేదరికంలో ఉన్న పిల్లలు చదువుకోవాలన్న ఆసక్తి ఉన్నప్పటికీ, పలకలు, పుస్తకాలను కొనుక్కోలేని దుస్థితిలో ఉన్న వారికి చేతనైన సాయం చేయాలన్న తలంపుతో వీటిని అందజేస్తున్నట్లు సత్యనారాయణ తెలిపారు. గిరిజన బాలలు బాగా చదువుకుని, ఉన్నతస్థాయికి చేరుకుని మరికొందరికి బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దుమంతి కిరణ్, పొగడాల అరవింద్, కిలే లక్ష్మణ్, మొయిరి మహేష్, కొక్కుల రవి పాల్గొన్నారు.



నోటుబుక్స్ అందజేస్తున్న సత్యనారాయణ

వ్యాపారి కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - అడ్డతీగల : మండల కేంద్రానికి చెందిన వ్యాపారి కిడ్నాప్ కేసును పోలీసులు చేధించారు. నిందితులను అరెస్ట్ చేశారు. దీనిపై సిఐ రాంబాబు విలేకరులకు వెల్లడించిన వివరాలివి.

మండల కేంద్రానికి చెందిన హోంనీడ్స్ వ్యాపారి వి.సుబ్బారావు ఈనెల 12న వ్యాపారరీత్యా వేరుప్రాంతానికి వెళుతుండగా, అడ్డతీగల మండలం తుంగమడుగుల పంచాయతీ దుప్పులపాలెం, జల్లూరు గ్రామాల మధ్య ఇద్దరు దుండగులు కాపు కాచి సుబ్బారావుని కిడ్నాప్ చేశారు. అతని కుటుంబసభ్యులకు బెదరించి, రూ.25 లక్షలు ఇస్తేనే వ్యాపారిని విడిచిపెడతాం, లేకుంటే సుబ్బారావును చంపేస్తామని హెచ్చరించారు. దీంతో ఆందోళనకు గురైన వ్యాపారి భార్య తోటివ్యాపారుల వద్ద రూ.5.50లక్షలను అప్పుచేసి, కిడ్నాపర్లు సూచించిన చోటుకు తన సోదరుడితో డబ్బులను పంపించింది. జల్లూరు సమీపంలో కిడ్నాపర్లు సూచనల మేరకు వారు చెప్పిన చోట నగదు బ్యాగ్‌ను వదిలేసి, వెనక్కు వచ్చేశాడు. తర్వాత బ్యాగ్‌ను తీసుకుని అడవిలోకి వెళ్లిపోయిన కిడ్నాపర్లు, తమ చెరలో ఉన్న వ్యాపారి సుబ్బారావును రాత్రి వేళ నాలుగు గంటల సమయంలో అడవిలోనే వదిలి వెళ్లారు. కిడ్నాపర్లు చెర నుంచి విడుదలైన సుబ్బారావు ఇంటికి చేరుకున్నాక, కుటుంబసభ్యులను సంప్రదించిన మీదట జరిగిన వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అల్లూరి జిల్లా ఎస్‌పి ఆదేశాలతో రంపచోడవరం ఎఎస్‌పి పర్యవేక్షణలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన అడ్డతీగల సిఐ రాంబాబు ఆధ్వర్యంలోని పోలీసు బృందాలు కిడ్నాప్ కేసును ఛాలెంజింగ్‌గా తీసుకుని చేధించారు.

దర్యాప్తులో సేకరించిన ఆధారాల మేరకు అడ్డతీగల మండలం డి భీమవరం గ్రామానికి చెందిన ఐనెళ్ల రాజ్‌కుమార్ అలియాస్ బంగారయ్య, అతని సమీపబంధువు ఐనెళ్ళ ఫణికుమార్‌గా ప్రాథమికంగా నిర్ధారించుకున్న పోలీసులు, వారికోసం గాలింపు చర్యలు చేపట్టి, దుప్పులపాలెం గ్రామ శివారులో అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు సంచరిస్తున్నారన్న సమాచారంతో అక్కడికి చేరుకుని వారిని పట్టుకున్నారు. వ్యాపారి కిడ్నాప్‌కేసులో నిందితులు వారేనని నిర్ధారించుకున్నాక అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.5.50లక్షల నగదుతోపాటు స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. వారిని అడ్డతీగల జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టుకు తరలిస్తున్నట్లు సిఐ వెల్లడించారు. దర్యాప్తులో ఎస్‌ఐ అప్పలరాజు, సిబ్బంది రాంబాబు, మూర్తి, రామన్న దొర, మిగిలిన సిబ్బంది సహకరించారని సిఐ తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న సిఐ రాంబాబు



స్వాధీనం చేసుకున్న నగదు

నోట్‌బుక్స్ పంపిణీలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి -కొయ్యూరు : గిరిజన సంక్షేమ గురుకులాలు, పాఠశాలల్లోని విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీలో నిర్లక్ష్యంపై ఎస్‌ఎఫ్‌ఐ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కొయ్యూరు మండల కమిటీ ఎన్నికకు నిర్వహించిన సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి జీవన్‌కృష్ణ మాట్లాడుతూ, కొత్త కమిటీ నేతలు మాట్లాడుతూ, నోటుబుక్స్ లేకుండా టీచర్లు చెప్పిన పాఠాలను విద్యార్థులు ఎక్కడ రాసుకోవాలో అధికారులే చెప్పాలని ప్రశ్నించారు. తక్షణమే స్పందించి, నోటుబుక్స్ పంపిణీతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించకుంటే ఐటిడిఎ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి సూరిబాబు మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదువుకోవాలని, భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్నఆదివాసీ గిరిజన సంఘం నేత సూరిబాబు

ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా పాంగి చందు, వంతల రంగారావు, కార్యదర్శులుగా పండు నాయుడు, వంతల చిట్టిబాబులను ఎన్ను కున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ సభ్యులు రాజు, సింహాద్రి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ

ఒట్టిపోయిన ఐస్‌గెడ్డ అందాలు!

కళావిహీనమై దర్శనమిస్తున్న మన్యంలోని జలపాతం
ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులకు తీవ్ర నిరాశ

ప్రజాశక్తి -సీలేరు: వర్షాల సీజన్ వచ్చిందంటే ఎత్తైన కొండలపైనుంచి జాలువారే జలపాతాలు, సెలయేటి గలగలలతో ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులను మంత్రముగ్ధులను చేసే సీలేరు ఐస్‌గెడ్డ అందాలు ఇపుడు కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటి వరకు కనీస వర్షాలు కురవకపోవడంతో ఐస్‌గెడ్డకు చెందిన జలపాతాలన్నీ ఒట్టిపోయి కనిపిస్తున్నాయి. వర్షాల సీజన్‌లో కురిసే వర్షపునీటితోపాటు, ఇప్పటికే కురిసిన వర్షాలతో ఊటబారిన కొండలపైనున్న వచ్చే నీటితో కలిసి, ఆకుపచ్చని చెట్ల మధ్యలోనుంచి, కొండలపైనుంచి తెల్లని పాలనురగలా ప్రవహించే జలపాతాలు తిలకించేందుకు ఇతర ప్రాంతాల నుంచి సందర్శకులు అధికసంఖ్యలో వచ్చేవారు. ఆంధ్రాఒడిశా ప్రధాన రహదారి పక్కన సీలేరుకు కూసంత దూరంలోనే ఐస్‌గెడ్డ జలపాతాలు ఉండడంతో వర్షాల సీజన్‌లో పర్యాటకుల తాకిడికూడా ఎక్కువగానే ఉండేది. జలపాతాల వద్ద పర్యాటకులు, ప్రయాణికులు కాసేపు ఆగి, సెల్ఫీలు, ఫోటోలను తీసుకునిగానీ వెళ్లేవారు కాదు. కానీ ఈ ఏడాది కనీస వర్షాలు లేకపోవడంతో గెడ్డతోపాటు జలపాతాలు కూడా వెలవెలబోయి కనిపిస్తుండడంతో పర్యాటక ప్రేమికులు నిరుత్సాహానికి గురౌతున్నారు.



నీరు లేక వెలవెలబోతున్న ఐస్‌గెడ్డ జలపాతం

మదిని దోచే మంచు సోయగం

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి ఉమ్మడి జిల్లా మన్యంలో మంచు అందాలు ప్రకృతి రమణీయమైన దృశ్యాలు చూపరుల మనసులను దోచుకుంటున్నాయి. అల్పపీడన ప్రభావంతో చిరుజల్లులు ఒకవైపు, మంచుదుప్పటి కప్పుకున్నట్లు కమ్మేసిన పొగమంచు అందాలు మరోవైపు ఉండగా, ఈ రెండింటి నడుమ దోబూచులాడుతున్న ముదురు నీలివర్ణంలో మేఘాలు వంటి సుందర దృశ్యాలు ఘాట్ రోడ్డు ప్రాంతంలో ఆవిష్కృతం కావడంతో సందర్శకులు, స్థానికులు మధురానుభూతికి లోనవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎత్తైన కొండలపై ఆకుపచ్చదనం నింపుకున్న పచ్చని చెట్లు, అడవి అందాల నడుమ నల్లని జెర్రిగొడ్డులా మెరుస్తూ కనిపించే తారురోడ్డు ప్రయాణికులతో పాటుపర్యాటకులను మైమరపింప జేస్తున్నాయి. ధారాలమ్మ దర్శనానికి ఆదివారం భారీగా తరలివచ్చే భక్తులంతా ఘాట్‌రోడ్డులోని రెయిన్‌గేజ్ వ్యూపాయింట్ వద్ద దట్టమైన మంచుతో కూడిన ప్రకృతి అందాలను ముందుగా చూసి తన్మయులై, మధురానుభూతిని పొందుతూ, తర్వాత అమ్మవారి దర్శనాలకు వెళ్లిపోతున్నారు.



రెయిన్‌గేజ్ వ్యూపాయింట్ వద్ద కమ్ముకున్న పొగమంచు



ఆర్థిక సహాయం చేస్తున్న సిఐటియు నేతలు

భవన నిర్మాణ కార్మికునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అరకులోయరూరల్:గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భవన నిర్మాణ కార్మికుడు కొర్రా శ్రీను విశాఖపట్నం కేజీహెచ్ లో అనారోగ్యంతో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు అరకువేలి మండల కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు, చిరు వ్యాపారస్తులు సహకారంతో ఇరవై మూడు వేల సేకరించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, తేజవతి, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గోపీ, సహాయ కార్యదర్శి దాసు, రాజేంద్ర, కొండలరావు చేతులు మీదుగా అందించారు.

586వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి:హెటిరో కంపెనీ రెండవ పైపులైన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 586వ రోజుకు చేరింది. శిబిరం వద్ద ఆదివారం మత్స్యకారులు పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా పెద్దెత్తున నినాదాలు చేశారు. పైపులైనుకు వ్యతిరేకంగా 586 రోజుల నుండి ఆందోళన చేస్తున్నప్పటికి నేటి వరకు సమస్య పరిష్కారానికి మార్గం చూపకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే కంపెనీ వ్యర్థ జలాలు సముద్రంలో వదలడంతో మత్స్య సంపద నశించి తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త పైపులైను ఏర్పాటు చేస్తే తమ మనుగడ ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైపులైన్ ఏర్పాటును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు.న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు గోసల సోమేష్, పిక్కి కాశీ, పిక్కి గంగరాజు, గురయ్య, నూకరాజు, కారే భూలోక, పిక్కి సత్తిరాజు, మైలపల్లి నల్ల, పిక్కి రమణ, ఉమ్మిడి నూకరాజు, బొంది నూకరాజు, దేవుడు, కొడ కాశీ, ఏపీ మత్స్యకార జెఎసి రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పిక్కి స్వామి తదితరులు పాల్గొన్నారు.

సిఎంపై మర్యాదగా మాట్లాడాలి

సినీ నటుడు జోగినాయుడు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గణేష్‌తో కలిసి సినీ నటుడు, సాంస్కృతిక శాఖ క్రియేటివ్ హెడ్ జోగినాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో ఆదివారం మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రిని సంబోధించే తీరును పవన్ కళ్యాణ్ మార్చుకుంటే మంచిదని తెలిపారు. సినిమా ఇండస్ట్రీలో 'మీరు చేసింది ఏమీ లేదని, కోట్ల రూపాయలు రెమ్యునరేషన్ తీసుకుంటున్నట్లు మీరే చెప్పారని, ఏదో ఉద్రేకంతో అన్నట్లుగా ఉత్తి మాటలు చెప్పడం దేనికని ప్రశ్నించారు. జనసేన పార్టీ పెట్టి పది సంవత్సరాలు అవుతున్నా ఎందుకు రాజకీయంగా ఎదగలేదన్నారు. ఇప్పుడైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. పవన్ కళ్యాణ్ సంస్కారవంతంగా మాట్లాడటం నేర్చు కోవాలని, ఆవేశంతో ఊగిపోతూ నోటికి ఏది వస్తే అది మాట్లాడటం సరికాదన్నారు. పది సంవత్సరాల పాటు కష్టపడి, ప్రజల మధ్య ఉండి రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్ ఎదిగారని, ఆయనపై విమర్శలు చేసేటప్పుడు సంస్కారవంతంగా మాట్లా డాలన్నారు.

మీనామృతం తయారీపై అవగాహన

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలోని పెట్టుగొల్లపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మీనామృతం తయారీ విధానంపై అనకాపల్లి జిల్లా డిపిఎం లచ్చన్న, ఎన్ఎఫ్ఏ శ్యామల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. తయారు చేసిన మీనామృతాన్ని పంటకి ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు.

బీడు బారుతున్న భూములు

దేవుడు మాన్యం భూముల సాగుకు ముందుకు రాని రైతులు

ప్రజాశక్తి-గొలుగొండ:రైతులు సాగు చేసేందుకు ముందుకు రాకపోవడంతో దేవుడు మాన్యం భూములు బీడు బారుతున్నాయి. గొలుగొండ మండలం దారమఠం దారమల్లేశ్వరస్వామి, లింగంపేట నూకాలమ్మ ఆలయాలకు చెందిన భూములకు మూడేళ్లకోసారి కౌలు వేలం నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది మూడు సార్లు వేలం పిలిచినా ఆ భూములను సాగు చేసేందుకు రైతులు ఎవరూ ముందుకు రాలేదు. మూడేళ్లగా పెట్టుబడి ఖర్చులూ రాకపోవడంతో దేవాదాయ శాఖకు అప్పు చేసి ఏటా శిస్తు చెల్లించామని పలువురు రైతులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో మాన్యం భూములను కౌలుకు తీసుకొని ఇంకా అప్పులు చేయలేమంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దారమల్లేశ్వరస్వామి ఆలయానికి 26 ఎకరాల విస్తీర్ణంలో పల్లపు భూములు ఉన్నాయి. వీటిని 11 భాగాలుగా చేసి కౌలుకు ఇస్తున్నారు. తద్వారా ఏటా రూ.2.4లక్షలు ఆలయానికి ఆదాయం వచ్చేది. ఈ సొమ్ముతో నిత్యం స్వామి వారికి పూజలు, పూజారి వేతనం, మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించేవారు. ఈ ఏడాది భూములు కౌలుకు తీసుకునేందుకు రైతులెవరూ ముందుకు రాకపోవడంతో పూజా కార్యక్రమాలు, ఉత్సవాల నిర్వహణకు నిధులు ఎలా అన్న మీ మాంశలో పడ్డారు.

లింగంపేట నూకాలమ్మ ఆలయానికి 37 ఎకరాల మెట్ట భూమి ఉంది. వీటిని ఏడు భాగాలు చేసి కౌలుకు ఇస్తున్నారు. ఏటా రూ.1.4 లక్షల కౌలు రూపేణా ఆదాయం వస్తోంది. ఈ మొత్తంతో కొత్త అమావాస్య జాతరను ఘనంగా నిర్వహించే వారు. గత ఏడాది శిస్తు డబ్బులు చెల్లించకలేక కౌలు రైతులు భూములను వదిలేసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఈ ఏడాది సాగు చేసేందుకు ముగ్గురే ముందు కొచ్చారు. ప్రస్తుతం 20.60 ఎకరాల భూమి బీడుగా ఉంది.

మరో సారి వేలం నిర్వహిస్తాం

ఈ విషయమై దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి రామకృష్ణను వివరణ కోరగా దారమఠం, లింగంపేట ఆలయాలకు చెందిన భూములకు మూడు విడతలుగా వేలం నిర్వహించామని, కౌలు చేసేందుకు రైతులు ఎవరూ ముందుకు రాలేదన్నారు. మరోసారి వేలంకు పిలుస్తామని, ఎవరూ రాకపోతే పరిస్థితిని వివరిస్తూ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. వారి సూచనల మేరకు తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు.

నేతల హామీలు నీటిమూటలు

కొండెక్కిన కొంతసంత మినీ రిజర్వాయర్ నాలుగేళ్లయినా పట్టించుకోని ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి-రోలుగుంట:గత నాలుగు శతాబ్దాలుగా ఈ ప్రాంత రాజకీయ నాయకులు ఎన్నికల ముందు కొండ సంత పణుకు పడగొడతా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానని హామీల వర్షం కురిపించడం ఓటర్లతో చప్పట్లు కొట్టించడం పరిపాటిగా మారింది. కొంతసంత మినీ రిజర్వాయర్ ఏర్పాటుపై 2019 ఎన్నికల ముందు ప్రస్తుత ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఎంకె.పట్నం శివారు గ్రామాలైన పెదపేట, శింగరాజుపేట, బిబి.పట్నం, రత్నంపేట, ఒడ్డిప, బుచ్చంపేట, రోలుగుంట గ్రామాల్లో హామీ ఇచ్చారు. గెలిచిన వెంటనే మొదటి సంతకం పెడతానని హామీ కూడా ఇవ్వడం పట్ల ఆయా గ్రామాల్లో ఇప్పుడు విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగేళ్లు పూర్తి అయినా పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. చింతపల్లి మండలం తాజంగి రిజర్వాయర్ లీకేజీ నీరు కొండ సంత మీదుగా వృధాగా పోతుందని, దానికి అడ్డంగా ఒక పణుకు ఉందని, ఆ పణుకును తీసేస్తే దానిని ఆనుకొని ఉన్న రోలుగుంట మండలం రెవెన్యూ ప్రాంతానికి నీరు వస్తుంది. మండల పరిధిలో నీరు నిల్వ చేయడానికి ట్యాంక్ ఏర్పాటు చేస్తే సుమారు 20వేల ఎకరాలకు నీరు అందుతుంది. అదనపు నీటిని మాకవరపాలెం మండలానికి సరఫరా చేయవచ్చు. ఈ రిజర్వాయర్ ఏర్పాటు చేయకపోతే కనీసం ఎంకె.పట్నం రెవెన్యూ పరిధిలోని చాకలిపణుకు వద్ద కొండగెడ్డకు చెక్‌డ్యామ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు రైతులు అంటున్నారు. దీనిపై కూడా ఎమ్మెల్యే శ్రద్ధ చూపించలేదు. లిఫ్ట్ ఇరిగేషన్ అయినా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కనీసం చెక్‌డ్యామ్ నిర్మించినా సుమారు 2వేల ఎకరాలకు నీరు అందుతుందని కొందరు అంటున్నారు. చాకలి పణుకు వద్ద చెక్‌డ్యాం నిర్మించి ఎంకె.పట్నం రెవెన్యూ పరిధిలోని పెద్ద చెరువు నుండి మాలచెరువు నుండి బిబి.పట్నం పక్షులవాని ట్యాంకుకు నీరందిస్తే పలు గ్రామాలు సస్య శ్యామలం అవుతాయని పలువురు అంటున్నారు.

హామీ కార్యరూపం ఏదీ?

గెలిచిన వెంటనే మొదటి సంతకం ఈ మినీ రిజర్వాయర్ పై పెడతానని ఎమ్మెల్యే ధర్మశ్రీ హామీ ఇవ్వడం జరిగింది. ఇప్పటికీ ఆ హామీ కార్యరూపం దాల్చలేదు.

'మధ్యాహ్న' కార్మికులకు...

కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి- చీడికాడ: ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సిఐ టియు నేత ఆర్.దేవుడు నాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎంపీపీ స్కూల్ వద్ద ఆదివారం మధ్యాహ్నం భోజన పథకం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు జి వరలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేముడు నాయుడు మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలన్నారు. కార్మికుల తొలగింపులు ఆపాలని, విద్యార్థులకు మెనూ చార్జీ పెంచాలన్నారు. గ్యాస్, వంట పాత్రల సామగ్రి ప్రభుత్వ సరఫరా చేయాలన్నారు. ఈ సమస్యలపై ఈనెల 31న అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు షేక్ బేబీ, ఎస్కే వహీదా, వై లక్ష్మి, జి.దేవి, జి.రాము పాల్గొన్నారు.

పవన్‌ను విమర్శించడం తగదు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను విమర్శించే అర్హత సినీ సైడ్ ఆర్టిస్ట్ జోగినాయుడికి లేదని ఆ పార్టీ నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ విమర్శించారు. ఆదివారం పవన్ కళ్యాణ్ పై జోగినాయుడు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 'పవన్ కళ్యాణ్ ఎంత రెమ్యూనరేషన్ తీసుకుంటే నీకు ఎందుకని... ఆయన తీసుకున్న కష్టాన్ని కౌలు రైతులకు అందిస్తున్నారన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు'. పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడే పాపులర్ అవ్వడామని అనుకుంటున్నావా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక, కళల క్రియేటివ్ హెడ్ గా ఉన్న జోగినాయుడు ఇప్పటి వరకు ఏమి చేశారో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు ఇన్చార్జి శివ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి దారేదీ?

మార్గం లేక ముందుకు సాగని పనులు

ప్రజాశక్తి -కోటవురట్ల:ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీకి దారి లేకుండా పోయింది. జల్లూరు గ్రామంలో సర్వే నెంబర్ 122లో 0.50 ఎకరాలు దాదాపు ఎకరా 20 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. ఈ కాలనీలో 21 మంది లబ్ధిదారులకు స్థలం ఎంపిక చేశారు. కాలనీకి వెళ్లేందుకు దారి లేక ఎవరూ నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రాలేదు. గృహాలు నిర్మించుకునేందుకు దారి లేక మెటీరియల్ ఎలాగు తీసుకు వెళ్లాలో అర్థం కాక నిర్మాణాలు చేపట్ట లేక పోతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారులు ముందుచూపు కొరవడిందని, కాలనీకి వెళ్లేందుకు దారిలేని స్థలం కొనుగోలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని పేర్కొన్నారు. కొనుగోలు చేసి సుమారు రెండు సంవత్సరాల కావస్తున్నా నేటికీ కాలనీ స్థలానికి వెళ్లే దారి చూపలేకపోయారని లబ్ధిదారులు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి కాలనీకి వెళ్లే దారి చూపాలని లబ్ధిదారులు కోరుకుంటున్నారు.

10వ రోజుకు రిలే దీక్ష

ప్రజాశక్తి-కోటవురట్ల:అణుకు గ్రామానికి పాఠశాల, రహదారి సౌకర్యం కల్పించాలని గిరి పుత్రులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష ఆదివారం 10వ రోజుకు చేరుకుంది. రహదారి, పాఠశాల లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతూ ఉండడంతో గిరి పుత్రులు పది రోజులుగా రిలే నిరాహార దీక్ష చేపడు తున్నారు. రహదారి లేక నిత్యావసర వస్తువులు, అత్యవసర పరిస్థితిలో రోగులను తరలించేందుకు అవస్థలు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డేవిడ్ రాజు, గిరిజనులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ పోటీలకు అర్హత

ప్రజాశక్తి-మాడుగుల:అంతర్జాతీయ చెస్ పోటీలకు మాడుగుల విద్యార్థులు అర్హత సాధించారు. ఈనెల 8,9 తేదీలలో నెల్లూరులో జరిగిన చెస్ పోటీలకు మాడుగుల వీనస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తాలపు రెడ్డి నాగ చంద్ర వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. ఈ పోటీలలో న్యూజిలాండ్, యుఎస్ఎ, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలు పాల్గొన్నాయి. ఇందులో 2.5 పాయింట్లు పొందితే ఫైడ్ ఐడి ఇవ్వబడి, తదుపరి పోటీలలో పాల్గొనేందుకు అవకాశం వుంటుంది. ఈ పోటీల్లో మాడుగుల విద్యార్థులు బొడ్డు ప్రదీప్ 4 పాయింట్లు, మొల్లి రంజిత్ కుమార్ 3, పిన బోయిన యువరాజు 3, పిన బోయిన ప్రదీప్ చంద్ర 2. 5 పాయింట్లు సాధించి, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. వీరు కొద్ది కాలంగా వీనస్ కోచింగ్ సెంటర్ వద్ద శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ఆదివారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు విద్యార్థులకు ధృవపత్రాలు పంపిణీ చేసి, భవిష్యత్ లో దేశం తరపున ఆడి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. వీరికి ఆర్థిక ప్రోత్సాహం మొవ్వ బుచ్చయ్య చౌదరి, జల్లు విశ్వేశ్వరరావు సతీమణి మీనాక్షి, భారత నిర్మాణ సేన అందించారు. ఈ కార్యక్రమంలో వీనస్ కోచింగ్ నిర్వాహకుడు తాలపురెడ్డి నాగచంద్ర, మొవ్వ బుచ్చయ్య చౌదరి, భారత నిర్మాణ సేన ప్రతినిధి మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

చోరీల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి- పాయకరావుపేట: మండలంలోని అరట్లకోట గ్రామంలో ఏఎస్ఐ గోవిందరావు అధ్వర్యంలో దిశ యాప్, అసాంఘిక కార్యకలాపాలు, చోరీల నియంత్రణపై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. అపరిచిత వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు వెంటనే చెర వేయాలన్నారు. కార్తికేయ కళాశాలలో సైబర్ నేరాలు, స్త్రీలపై జరిగే అఘాయిత్యాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులలో టోల్ ఫ్రీ నెంబర్లు 100, 112లకు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో క్రైమ్ స్పాట్ ఇన్చార్జి హెచ్‌సికే శ్రీనివాసరావు, సిబ్బంది భరతుడు, దేవందర్, సర్పంచ్ అప్పలనరస, కార్తికేయ కళాశాల ప్రిన్సిపాల్ స్వామి పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న ఆటో రిక్షా కార్మిక సంఘం కార్యకర్తలు

స్ఫూర్తిదాయకం.. 'ఉక్కు' పరిరక్షణ పోరాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం) : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని చేపట్టిన ఉద్యమం మరో స్వాతంత్ర్య పోరాటం వంటిదని విశాఖ మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు అన్నారు. ఈ పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగుతోందని తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలేదీక్షలు ఆదివారానికి 836వ రోజుకు చేరాయి. దీక్షల్లో విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజల ఆస్తులైనటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను కొద్దిమంది కార్పొరేట్ల చేతుల్లో పెట్టే ప్రయత్నం ఇప్పుడున్న బిజెపి ప్రభుత్వం చేస్తోందని అన్నారు. ఇప్పటికే అనేక రకాలుగా ప్రభుత్వ సంపదను వాళ్లకు కట్టబెట్టారని గుర్తు చేశారు. రాష్ట్రానికే తలమానికమైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన భూములను కాజేయచూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, గణేష్, శ్రీను, పైడిరాజు, సోంబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

విసిసి ఆధ్వర్యాన చదరంగం పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ప్రపంచ చదరంగం దినోత్సవం సందర్భంగా ఆదివారం వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) ఆధ్వర్యంలో చదరంగం పోటీలు నిర్వహించారు. విసిసి ప్రతి సంవత్సరం ఈ పోటీలను క్లబ్, జోన్, జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. తాజా పోటీల్లో 56 మంది పాల్గొన్నారు. వీరిలో ఆరుగురు విన్నర్స్, ఆరుగురు రన్నర్స్‌గా నిలిచారు. వీరికి అతిథులు బహుమతులు అందించారు. అలాగే పోటీల్లో పాల్గొన్న వారందరికీ నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లాలో మధురవాడ, జగదాంబ, కంచరపాలెం, మద్దిలపాలెం, గాజువాక, బాలయ్య శాస్త్రి లేవుట్ ప్రాంతాల నుంచి చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన రొటేరియన్ మోదంబికా దేవి మాట్లాడుతూ చెస్ ఆడడం ద్వారా పిల్లలలో కాన్సెంట్రేషన్, లాజిక్, చురుకుదనం పెరుగుతాయని తెలిపారు. ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ విసిసి పిల్లల కోసం నిరంతరం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. విసిసి ఫౌండర్ కె.రమాప్రభ మాట్లాడుతూ పిల్లల అభివృద్ధిలో ఆటలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. ఎల్ఐసి ఉద్యోగి, చెస్ కోచ్ చాగంటి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ 15 రోజులుపాటు తన వద్ద చిన్నారులు శిక్షణ పొందారన్నారు. చెస్ పట్ల చాలా ఆసక్తి చూపారని తెలిపారు. సేవా సంస్థ ఫౌండర్, చెస్ కోచ్ కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ ఓటమి గెలుపునకు పునాదివంటిదన్నారు.

కవితల పోటీకి గడువు పెంపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కార్యదర్శిగా వ్యవహరించిన నూనెల శ్రీనివాసరావు తృతీయ వర్ధంతి సందర్భంగా ఈ నెల 22న అభ్యుదయ కవితలు, మినీ కవితల పోటీని నిర్వహిస్తున్నామని పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్ పెంటకోట రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కవితలను పంపే గడువును ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఔత్సాహిక యువ కవులు, కవయిత్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రథమ ఉత్తమ కవితకు రూ.2 వేలు, ద్వితీయ ఉత్తమ కవితకు రూ.1,500, తృతీయ ఉత్తమ కవితకు రూ.1000 నగదు బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. కవితలను ఇ-మెయిల్ ద్వారా sahithisravanthi visakha@gmail.comకు, వాట్సప్ ద్వారా 8247797303, 9490099222 నెంబర్లకు పంపాలని విజ్ఞప్తి చేశారు.

నిరాశాజనకంగా జలాశయాలు

వర్షాల్లేక తగ్గిన నీటి నిల్వలు - ఆలస్యంగా సాగునీరు విడుదల

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో జలాశయాల నీటిమట్టాలు తక్కువగా వున్నాయి. జలాశయాల పైభాగంలో వర్షాల్లేక నీటిప్రవాహాలు తగ్గుముఖం పట్టాయి. దీనివల్ల ఖరీఫ్‌కు సకాలంలో నీరు విడిచిపెట్టలేని పరిస్థితి ఏర్పడింది. గతేడాది ఇదే సమయానికి తాండవ జలాశయం నీటిని నీటిపారుదల శాఖాధికారులు విడిచిపెట్టారు. ఈ ఖరీఫ్‌కు వరహా మినహా మిగిలిన జలాశయాల్లో నీటి నిల్వలు ఆశించినంతగా లేవు. ఇతర జలాశయాల కంటే కొంత మెరుగ్గావున్నప్పటికీ వరహాలోనూ పూర్తిస్థాయి నీటి నిల్వలు సామర్థ్యానికి తగినంతలేవు. వర్షాలు సరిగా లేకపోవడంతో ఆకుమడులను రైతులు తయారుచేసు కోలేకపోయారు. జిల్లాలో ఖరీఫ్ వరి సాధారణ సాగు విస్తీర్ణం 1.30 లక్షల ఎకరాలకు తాండవ, రైవాడ, కోణాం, వరహా, పెద్దేరు జలాశయాల కింద 52,074 ఎకరాలు సాగవుతోంది. గతేడాది జలాశయాల నీటి నిల్వలు బాగుండడంతో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ పాటికే నీరు విడిచిపెట్టారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో తాండవ నీటిని ఆగస్టు మొదటి వారంలో విడిచి పెట్టాలన్న ఆలోచనలో నీటిపారుదల శాఖాధికారులున్నారు. జిల్లాలో తాండవ కింద 32,689 ఎకరాలు, రైవాడ కింద 15,344 ఎకరాలు, కోణాం కింద 12,276 ఎకరాలు, వరహా కింద 4,485 ఎకరాలు, పెద్దేరు కింద 19,969 ఎకరాల ఆయకట్టు వుంది.



తాండవ జలాశయం

జలాశయాల నీటిమట్టాల వివరాలు

జలాశయం	ఎఫ్ఆర్ఎల్	జులై 15 నాటికి	గతేడాది ఇదే సమయానికి
తాండవ	380	369.10	375.10 (అడుగులు)
రైవాడ	114	108.20	111.30 (మీటర్లు)
కోణాం	101	95.60	97.60 (మీటర్లు)
వరహా	460	450	456.10 (అడుగులు)
పెద్దేరు	137	134.90	136.60 (మీటర్లు)

ధర్మశ్రీపై సిఎం సీరియస్..!

ఆరోపణలు, అసంతృప్తులపై ఆరా - అమరావతికి ఎమ్మెల్యే పయనం
మరికొద్ది రోజుల్లో యలమంచిలి ఎమ్మెల్యేకు పిలుపు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అధికార పార్టీ నాయకుల వ్యవహారశైలి పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సీరియస్‌గా వున్నట్లు తెలుస్తోంది. విశాఖపట్నం జిల్లా వైసిపి అధ్యక్ష పదవికి పంచకర్ల రమేష్‌బాబు రాజీనామా తరువాత నాయకత్వ లోపాలను సరిదిద్దే పనిని సిఎం తీసుకున్నారన్న ప్రచారం పార్టీలో జరుగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజలతో సన్నిహితంగా వుండకుండా, వారిపై దురుసుగా ప్రవర్తించిన ఎమ్మెల్యేలు ఒక్కొక్కరినీ ఆయన పిలిపించుకుంటున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కొన్నిచోట్ల ప్రజల నుంచి వ్యతిరేకత, అసంతృప్తి, ఆరోపణలు ఎదుర్కొన్న ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని అమరావతికి రమ్మన్నట్లు తెలిసింది. సోమవారం ఉదయం 9 గంటలకు అపాయింట్‌మెంట్ ఇవ్వడంతో ఆదివారం రాత్రి అమరావతికి ధర్మశ్రీ బయలుదేరివెళ్లినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకూ వచ్చిన ప్రతి ఆరోపణా, అసంతృప్తులకూ కారణాలను సిఎం అడిగి తెలుసుకోనున్నారు. మంత్రి పదవి ఇవ్వలేదని బాధపడ్డ ధర్మశ్రీకి ప్రభుత్వ విప్, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. కొంతకాలం పనిచేశాక అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించి, గవర కార్పొరేషన్ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌కు పార్టీ బాధ్యతలు అప్పజెప్పారు.

పార్టీని బలోపేతం చేయడం కంటే తన సామాజిక తరగతికి ధర్మశ్రీ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్న సమాచారం సిఎంకు వుంది. దీనివల్ల నియోజకవర్గ స్థాయిలో నాయకత్వం మధ్య సమన్వయలేమి, అంతర్గత సమస్యలు, అసంతృప్తులు బలపడుతున్నాయన్న ఫిర్యాదులు అధిష్టానం దృష్టికి వెళ్లాయి. తన సామాజిక తరగతిని కూడగట్టడం వెనుకవున్న భవిష్యత్ వ్యూహాన్ని పై నాయకత్వం పసిగట్టింది. ఈ పరిణామాలన్నీ జరుగుతున్న నేపథ్యంలో ధర్మశ్రీని పిలిపించి మాట్లాడాలన్న నిర్ణయానికి సిఎం వచ్చినట్లు సమాచారం.

యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు వ్యవహారశైలి పట్ల సిఎం అసంతృప్తితో వున్నట్లు తెలిసింది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలు చెప్పిన జనంపై దురుసుగా ప్రవర్తిస్తున్న ఆ ఎమ్మెల్యేపై నియోజకవర్గ వైసిపి నాయకులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యే వ్యవహారశైలితో ఇప్పటికే పార్టీకి నష్టం జరిగిందని, ఇప్పటికైనా ఆయనలో మార్పురాకపోతే పూడ్చలేని నష్టం వాటిల్లుతుందని నియోజకవర్గ నాయకులు మాట్లాడుకోవడం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగకుండా కొద్ది రోజుల్లో రమణమూర్తిరాజును కూడా సిఎం పిలిచి మాట్లాడనున్నట్లు జిల్లాలోని పార్టీ ప్రధాన నాయకులు చెప్పుకుంటున్నారు.



మాట్లాడుతున్న అనిత

మహిళల పట్ల గౌరవం కరువు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపికి మహిళల పట్ల ఎటువంటి గౌరవమూ లేదని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ టిడిపి అడుగుతున్న ప్రశ్నలకు వైసిపి సమాధానాలు చెప్పలేకపోతోందని అన్నారు. ఇతర పార్టీల మహిళలను కించ పరిచేలా ఆ పార్టీ నేతలు వాఖ్యలు చేస్తున్నారన్నారు. మద్యపాన నిషేధం ఎప్పుడు చేస్తారో చెప్పమంటే చెప్పలేరన్నారు. పైగా స్త్రీ జాతి వినలేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. తనపై అత్యంత హేయమైన వ్యాసాలు రాసి బాధ పెడుతున్నారని, నోటికి వచ్చిన దారుణమైన పదజాలం వినియోగిస్తున్నారని తెలిపారు. సిఎం సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు సజ్జల భార్గవరెడ్డి సోషల్ మీడియాలో రాతలు రాయిస్తున్నారని చెప్పారు. ఒక ఆడబిడ్డ మీద ఇలాంటి రాతలు ఎలా రాస్తారని ప్రశ్నించారు. ఈ విషయాల మీద ఫిర్యాదుకు డిజిపి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. సిఎంను ప్రశ్నించడమే తాను చేసిన తప్పా అని అడిగారు. చదువుకున్న దళిత ఆడబిడ్డనైన తనకు చంద్రబాబు ఎంతో అండగా నిలిచారని తెలిపారు. మహిళా సమస్యలపై తాము పోరాటం చేస్తుంటే వైసిపి సోషల్ మీడియా గజ్జి కుక్కలా మొరుగుతోందని అన్నారు. సమావేశంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, నాయకులు కేదారి లక్ష్మి, ఈతలపాక సుజాత, గణగళ్ల సత్య, తోట శ్రీదేవి పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరాన్ని మరింత పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు నూతనంగా నియమితులైన పారిశుధ్య కార్మికులు బాధ్యతాయుతంగా పనిచేయాలని వైసిపి ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయకర్త, టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన హోటల్ మేఘాలయలో జివిఎంసిలో వివిధ కారణాల వల్ల ఏర్పడిన 482 పోస్టులకుగాను ప్రస్తుతం 119 మందికి ఉద్యోగ నియమాక పత్రాలను నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారితో కలిసి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందర విశాఖ నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దడంలో పారిశుధ్య కార్మికులు కీలకమన్నారు. వారు నిరంతరం నగర పరిశుభ్రతకు పాటుపడుతున్నారని కొనియాడారు. నగర మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ 482 ఉద్యోగాలకుగాను ప్రస్తుతం 119 మందిని అర్హులుగా ప్రకటించామని, వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందించామని తెలిపారు. వారంతా ఈ నెల 17 నుంచి విధుల్లో చేరుతారని తెలిపారు. వివిధ కారణాల వల్ల మరణించిన, 60 సంవత్సరాలు పైబడి విధుల నుంచి తొలగింపబడిన కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలతో వారి కుటుంబాలలో వెలుగు నింపేందుకు అర్హులైన వారందరికీ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సత్యవతి, భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాస్, గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు.

అమరేష్‌కు ఆశ్రయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కొద్ది రోజుల క్రితం 50 ఏళ్ల వయసుగల వ్యక్తి సంగం, శరత్ థియేటర్‌కు ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై పడి ఉండగా అతనిని ఎయుటిడి సిబ్బంది గుర్తించి నగరంలోని మెంటల్ కేర్ ఆసుపత్రిలో చికిత్స అందించగా తాజాగా కోలుకున్నాడు. ఆసుపత్రి నుంచి రికవరీ సమాచారం అందడంతో ఎయుటిడి, టిఎస్ఆర్ నిరాశ్రయుల వసతి గృహం సిబ్బంది అక్కడకు వెళ్లి అతన్ని తీసుకువచ్చి వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. కోలుకున్న ఆయన తన పేరు అమరేష్ అని చెప్పారని నిరాశ్రయుల వసతి గృహం నిర్వాహకుడు ప్రగడ వాసు తెలిపారు. కొద్ది రోజులు ఇక్కడ ఉంచి పూర్తిస్థాయిలో ఆయన కోలుకున్న తర్వాత అతని పూర్తి వివరాలు తెలుసుకొని, వారి బంధువులకు అప్పగిస్తామన్నారు.